క్లుప్తంగా

9 నుంచి శాంతి సద్భావన యాత్ర



శాంతి సద్భావన యాత్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మేయర్ డాక్టర్ శిరీష, వక్తలు

తిరుపతి కల్చరల్: ఉత్తర అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9న ప్రపంచ వ్యాప్తంగా 100 దేశాల్లో శాంతి సద్భావన యాత్ర చేపడుతున్నట్టు పలువురు వక్తలు తెలిపారు. రాస్ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష శాంతి సద్భావన యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, సీనియర్ జర్నలిస్టు ఎ.గిరిధర్, జి.శ్రీధర్, ఎ.రాఘవ శర్మ, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖులకు స్వాగతం



త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్డీవో నిషాంత్‌రెడ్డి



లోకయుక్త జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డితో మాట్లాడుతున్న ఆర్డీవో

తిరుపతి అర్బన్ : జిల్లా పర్యటన నిమిత్తం తిరుపతికి చేరుకున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి, ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డికి శనివారం పద్మావతి అతిథి గృహం వద్ద ఆర్డీవో నిషాంత్‌రెడ్డి స్వాగతం పలికారు. వారికి అవసరమైన ఏర్పాట్లు కల్పించారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు

తిరుపతి అర్బన్: తిరుపతి–పాపానాయుడుపేట రోడ్డులో నడుస్తున్న ఆర్టీసీ మూడు బస్సుల్లో ఏర్పాటు చేసిన బాక్సుల్లో ప్రయాణికులు వేసి టికెట్లను డ్రా తీశామని మంగళం డిపో మేనేజర్ భాస్కర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళం డిపోకు చెందిన మూడు సర్వీసుల్లో ప్రయాణికుల సంఖ్యను పెంచడానికి 15 రోజులకు ఒకసారి తీసిన డ్రాలో మూడు టికెట్లు తీసుకున్న వారికి బహుమతులు అందజేస్తున్నట్లు వెల్లడించారు. శనివారం తీసిన డ్రాలో వేలాయుధం, వరకుమార్‌రెడ్డి, బత్తెమ్మ విజేతలుగా నిలిచారని పేర్కొన్నారు. వారు ఈ నెల 26వ తేదీ లోపు మంగళంలోని ఆర్టీసీ డిపోలో బహుమతులను తీసుకోవాలని సూచించారు.

నేడు అవార్డుల ప్రదానం

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని ధరణి అబాకస్ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో నిర్వహించిన అబాకస్ శిక్షణలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఆదివారం ఆఫీసర్స్ క్లబ్‌లో అవార్డులు అందజేయనున్నారు. ఈ మేరకు అబాకస్ సంస్థ డైరెక్టర్ ఎం.రవికుమార్ శనివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ఏఎస్పీ విమలకుమారి, గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్, జాతీయ సంస్కృత వర్సిటీ ప్రొఫెసర్ సచ్చిదానందమూర్తి, చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్ చేతుల మీదుగా ట్రోఫీలు, పతకాలు, సర్టిఫికెట్లు అందజేస్తామని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



వరుడి కుటుంబ సభ్యులకు పెళ్లి కానుక అందజేస్తున్న నాయకులు

చంద్రగిరి: మండలంలోని మిట్టపాళెం గ్రామానికి చెందిన వినయ్‌రెడ్డి, వెంకట తనూజకు వివాహం నిశ్చయమైంది. వారికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిన పెళ్లి కానుకను శనివారం వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు పసల నాగరాజు ఆధ్వర్యంలో ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, మావిళిరెడ్డి నితిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యంతోనే మనుగడ



మాట్లాడుతున్న సుమన్

ఏర్పేడు: మానవ మనుగడకు జీవవైవిధ్యం ఎంతో అవసరమని ఆంధ్రప్రదేశ్ జీవవైవిధ్య మండలి ప్రతినిధి సుమన్ అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మొక్కలను విరివిగా నాటి వాటిని సంరక్షించాలన్నారు. అడవులను పరిరక్షించాలని సూచించారు. ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి మర్థాల రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండానే రోడ్లపై సవారీ

రాష్ట్రంలోనే అత్యధిక వాహనాలు ఉన్న తిరుపతి జిల్లాలో డ్రైవింగ్ లైసెన్స్‌ల సంఖ్య మాత్రం అందుకు భిన్నంగా ఉంది. జిల్లా మొత్తం సుమారు 8 లక్షల వాహనాలుండగా డ్రైవింగ్ లైసెన్స్‌ల సంఖ్య 4.80 లక్షలు మాత్రమే. మూడు లక్షల మంది లైసెన్స్‌లు లేకుండానే వాహనాలు కలిగి ఉన్నట్లు రవాణాశాఖ రికార్డులు చేబుతున్నాయి. లైసెన్సీల జారీ ప్రక్రియను సులభతరం చేసినా వాహనదారులు నిర్లక్ష్యం వీడడం లేదు.

– తిరుపతి మంగళం

- జిల్లాలోని వాహనాల సంఖ్య 8 లక్షలు
- డ్రైవింగ్ లైసెన్స్‌ల సంఖ్య– 4.80 లక్షలు
- లైసెన్స్‌లు లేనివారు 3 లక్షలకు పైనే
- వాహనాలు నడుపుతున్న మైనర్లు
- ప్రమాదాలు జరుగుతున్నా స్పందన నిల్

ఏటా వేలాది వాహనాలు రోడ్డెక్కుతున్నాయి. ప్రజలు వాహన కొనుగోలులో చూపుతున్న ఆసక్తి డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవడంలో చూపడం లేదు. ముఖ్యంగా మైనర్లు ఎక్కువ మంది వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. పిల్లలు మారాం చేస్తున్నారని తల్లిదండ్రులు వాహనాలు కొనిస్తున్నారు. వారికి డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవడంలో మాత్రం శ్రద్ధ చూపడం లేదు. దీనికి తోడు రహదారుల సామర్థ్యానికి మించిన వేగం కలిగిన వాహనాలు కొనుగోలు చేస్తుండడంతో ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.



ద్విచక్ర వాహనంపై వెళుతున్న ముగ్గురు బాలురు

లైసెన్స్ ప్రక్రియ సులభతరమైనా...

ఇటీవల కాలంలో డ్రైవింగ్ లైసెన్స్ జారీ ప్రక్రియను ప్రభుత్వం సులభతరం చేసింది. ఎల్ఎల్ఆర్ మంజూరు చేసే విషయంలో ఎన్నో సడలింపులు ఇవ్వడంతోపాటు మేళాలు నిర్వహిస్తున్నారు. చాలామంది నిర్లక్ష్యం వీడడం లేదు. ముఖ్యంగా లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపేవారిలో మహిళలు, మైనర్లే ఎక్కువ మంది ఉన్నారు. ఇంటి అవసరాలు, పిల్లలను పాఠశాలలకు తీసుకెళ్లి రావడం, ఉద్యోగ రీత్యా మహిళలు వాహనాలను వినియోగిస్తున్నారు. వీరిలో 75 శాతం మందికి లైసెన్సు ఉండడం లేదు. వారితో పాటు మైనర్లు సైతం అధికంగా ఉన్నారు. వీరు ఒక్కొక్క బైక్‌పై ఇద్దరు, ముగ్గురిని ఎక్కించుకుని సవారీ తీస్తున్నారు.

కేసులు, జరిమానాలతో హడల్

గతంలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా అధికారులకు పట్టుబడి రూ.100, రూ.200 జరిమానా కట్టేసి వెళ్లిపోయేవారు. ఇటీవల కేసు నమోదు చేస్తున్నారు. అందులో ఒకరోజు నుంచి వారం రోజులు శిక్ష పడుతోంది. జరిమానాలు కూడా విధిస్తున్నారు. ఈ కారణంగా ఏడాదిలో రవాణా కార్యాలయాలకు వెళ్లి లైసెన్సు తీసుకునే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది.



బైక్‌పై నలుగురి ప్రయాణం

కఠినంగా వ్యవహరిస్తున్నాం

గతంలో జరిమానాల వల్ల డ్రైవింగ్ లైసెన్స్ తీసుకునే విషయంలో నిర్లక్ష్యం చూపేవారు. ఇటీవల కఠిన చర్యలు తీసుకుంటున్నాం. కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నాం. వాహనం నడిపే వ్యక్తితో పాటు యజమానిపైనా చర్యలు తీసుకుంటున్నాం. దీంతో లైసెన్స్‌ల కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకుంటున్నారు. వంద శాతం డ్రైవింగ్ లైసెన్స్‌లు ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం.

– సీతారామిరెడ్డి, జిల్లా రవాణాశాఖాధికారి

వేడుకగా ఆయుధ పూజ



టీటీడీ ముద్రణాలయంలో ఆయుధ పూజ చేస్తున్న టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి, జేఈవోలు

తిరుపతి కల్చరల్: టీటీడీ రవాణా విభాగంలో శనివారం ఆయుధపూజను వేడుకగా నిర్వహించారు. టీటీడీ జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారికి ఆ విభాగాధిపతి శేషారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. జీఎం శేషారెడ్డి జేఈవోలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో డీఎల్‌వో వీర్రాజు, వీజీవో బాలిరెడ్డి, ట్రాన్స్‌పోర్ట్ డీఎం లక్ష్మీప్రసన్న, డీఐ మోహన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా టీటీడీ పరిపాలన భవనం ఎదురుగానున్న ముద్రణాలయంలోనూ ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీవారికి పూజలు చేశారు. అర్చకులు వేదమంత్రాలు పఠిస్తూ యంత్రాలకు పూజలు చేశారు. ఇక్కడ ఉన్న డీటీపీ, ఆఫ్‌సెట్, మెషిన్ సెక్షన్, ఆర్టిస్టు, బైండింగ్ విభాగాల్లోని యంత్రాలకు ఆయుధపూజ చేశారు. అనంతరం రూ.16 లక్షలతో ఏర్పాటు చేసిన ఫర్ఫెక్ట్ బైండింగ్ మెషిన్‌కు ఈవో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సదా భార్గవి, వీరబ్రహ్మం, డీఎల్‌వో వీర్రాజు, ముద్రణాలయం ప్రత్యేకాధికారి రామరాజు, వీజీవో బాలిరెడ్డి, అన్ని విభాగాలకు చెందిన సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.



రవాణా శాఖలో ఆయుధ పూజలు చేస్తున్న టీటీడీ జేఈవోలు, అధికారులు

వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా సోమశేఖర్‌రెడ్డి

తిరుపతి మంగళం : వైఎస్సార్ సీపీ తిరుపతి ఎంఆర్‌పల్లి యువజన విభాగం అధ్యక్షుడిగా అరకాల సోమశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయనకు శనివారం పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యున్నతికి యువత సేవలు ఎంతో అవసరమని, అందుకోసం తాము నిరంతరం కృషి చేస్తామని భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో టౌన్‌బ్యాంక్ డైరెక్టర్ మబ్బు నాదమునిరెడ్డి, నాయకులు వెంకటమునిరెడ్డి, డిష్ చంద్ర, మనోహర్‌రెడ్డి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రం అందజేస్తున్న అభినయ్‌రెడ్డి

రోడ్లు, కాలువ పనుల పరిశీలన



సీసీరోడ్ల పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

తిరుపతి మంగళం : తిరుపతి ఎస్టీవీనగర్‌లో చేపట్టిన సీసీరోడ్లు, మురుగుకాలువ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం ఎస్టీవీనగర్‌లో సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. తిరుపతి నగరంలో ఎవ్వరూ ఊహించని విధంగా ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి నేతృత్వంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. రాబోయే ఎన్నికల్లో తిరిగి జగనన్నను గెలిపించుకుంటే తిరుపతి మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

ఓటరు సవరణను సద్వినియోగం చేసుకోండి



ఓటరు లిస్టును పరిశీలిస్తున్న అధికారులు, బీఎల్వోలు

చంద్రగిరి: ఓటరు కార్డుల సవరణను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శిరీష కోరారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో శనివారం ఓటరు నమోదు, సవరణలు, తొలగింపులపై ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాలు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఫారం 6, 6ఏ, 7, 8 అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఓటరు ప్రక్రియలో అభ్యంతరాలుంటే మండల ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయవచ్చని, నూతన ఓటరు నమోదు ప్రక్రియను కూడా చేపట్టామన్నారు. డీటీ మోహన్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కాలభైరవ క్షేత్రంలో అష్టమి పూజలు

పిచ్చాటూరు: మండలంలోని రామగిరిలో వెలసియున్న శ్రీకాలభైరవ క్షేత్రంలో ఆదివారం అష్టమి పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ లత తెలిపారు. ఉదయం 6 గంటలకు ఆలయంలో కొలువైన శ్రీకాలభైరవ స్వామికి అభిషేక పూజలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి అష్టమి రోజున భారీగా భక్తులు నేతి దీపాలు వెలిగించి పూజల్లో పాల్గొనడం ఆనవాయితీ.

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

నింద్ర: మండలంలోని కేఆర్ పాళెం గ్రామంలో వెలసిన ఆంజనేయ స్వామివారికి గ్రామస్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం భక్త బృందం ఆలయంలో భజనలు చేశారు.

కల్యాణి డ్యామ్‌కు 10 లక్షల చేపపిల్లల తరలింపు

తిరుపతి అర్బన్ : తిరుపతి జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో విద్యుత్ మోటార్లు, వైర్లు చోరీకి గురయ్యాయి. దీంతో నీటి సమస్య నెలకొంది. కార్యాలయం వద్ద నీటి తొట్టెల్లో చేపట్టిన 10 లక్షల చేపపిల్లల పెంపకం ప్రశ్నార్థకంగా మారింది. కొత్తగా వైర్లు, మోటార్లు బిగిస్తున్నా రెండు మూడు రోజుల వ్యవధిలోనే దొంగలు మాయం చేస్తున్నారు. దీంతో అధికారులకు ఆందోళన తప్పలేదు. ఈ నేపథ్యంలో 10 లక్షల చేప పిల్లలను శుక్రవారం కల్యాణి డ్యామ్ వద్ద ఉన్న పెంపక కేంద్రానికి తరలించారు. దీనిపై జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ చేపల పెంపక కేంద్రం వద్ద తరచూ విద్యుత్ మోటార్లు, వైర్లు చోరీకి గురవుతున్నాయని తెలిపారు. దీంతో తిరుపతి మత్స్యశాఖ కార్యాలయం వద్ద ఉన్న చేపపిల్లలతో పాటు జాలర్లను కూడా కల్యాణి డ్యామ్‌కు తరలించామన్నారు. వర్షాలు వచ్చిన వెంటనే చేప పిల్లలను చెరువుల్లో వదులుతామని చెప్పారు.



జిల్లా మత్స్యశాఖ కార్యాలయం వద్ద ఖాళీగా దర్శనమిస్తున్న చేపల తొట్టె

ఫిష్ మార్కెట్ ఏర్పాటు చేయాలి

తిరుపతి కల్చరల్: తిరుపతి కార్పొరేషన్ పరిధిలో నూతనంగా ఫిష్ మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ 104వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం శ్రీనివాస కల్యాణ మండపం వద్ద జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ చేపల వ్యాపారులు గత 10 ఏళ్లుగా శ్రీనివాస కల్యాణ మండపం వద్ద రోడ్డు పక్కన చేపలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వీరిని కార్పొరేషన్ అధికారులు గుర్తించి గుర్తింపు కార్డులు మంజూరు చేసినట్టు తెలిపారు. వీరికి కార్పొరేషన్ పరిధిలో షాపులు కట్టించి తక్కువ బాడుగకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీధి వ్యాపారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.శివకుమార్, సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ.రవి, ఆటో, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్, టాక్సీ వర్కర్స్, ఆటో యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.



ఏఐటీయూసీ జెండా ఆవిష్కరిస్తున్న రాధాకృష్ణ

అవినీతికి నో చెప్పండి.. దేశానికి కట్టుబడి ఉండండి



ర్యాలీ చేస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రతినిధులు, ఉద్యోగులు

తిరుపతి కల్చరల్: అవినీతికి నో చెప్పండి.. దేశానికి కట్టుబడి ఉండండి అని బ్యాంక్ ఆఫ్ బరోడా రీజనల్ మేనేజర్ పి.అమర్నాథరెడ్డి పిలుపునిచ్చారు. విజిలెన్స్ వారోత్సవంలో భాగంగా బ్యాంక్ ఆఫ్ బరోడా ఉద్యోగులు శనివారం ప్రజలకు అవగాహన కల్పిస్తూ వాక్‌థాన్ ర్యాలీ నిర్వహించారు. వాక్‌థాన్ వీవీ మహల్ రోడ్డులోని బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ నుంచి కేటీ రోడ్డులోని అన్నారావు సర్కిల్ వరకు సాగింది. ఆయన మాట్లాడుతూ సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో గత నెల అక్టోబర్ 30 నుంచి ఈనెల 5వ తేదీ వరకు విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్–2023 నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ లక్ష్యం అవినీతికి నో చెప్పండి.. దేశానికి కట్టుబడి ఉండండి అన్న నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళుతున్నట్లు తెలిపారు. ర్యాలీ అనంతరం విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్–2023 సందర్భంగా సమగ్రతా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో బీవోబీ డెప్యూటీ రీజనల్ మేనేజర్, తిరుపతి నగరంలోని వివిధ బీవోబీ బ్యాక్ మేనేజర్లు పాల్గొన్నారు.

విజిలెన్స్ చైతన్య వారోత్సవాలు

చంద్రగిరి: చంద్రగిరి కొత్తపేటలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం విజిలెన్స్ చైతన్య వారోత్సవాలు నిర్వహించారు. యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ రాంప్రసాద్, విజిలెన్స్ అధికారి గిరిధర్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. యూని యన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో శనివారం నుంచి వారం రోజులు విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది సే నో టు కరప్షన్, కమిట్ టు ది నేషన్ అన్న నినాదంతో బ్యాంక్ పని చేస్తోందన్నారు. అనంతరం లంచగొడితనాన్ని నిర్మూలిద్దామని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఎల్‌డీఎం సుభాష్, మహేష్ కుమార్, సరిత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ రాంప్రసాద్

నిర్దేశించిన ప్రదేశాల్లోనే టపాసుల విక్రయాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో నిషాంత్‌రెడ్డి

తిరుపతి అర్బన్: ప్రభుత్వం నిర్దేశించిన ప్రదేశాల్లోనే టపాసుల విక్రయాలు చేపట్టాలని ఆర్డీవో నిషాంత్ రెడ్డి తెలిపారు. ఆయన శనివారం వ్యాపారులు, అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ టపాసుల విక్రయాలకు అనువైన ప్రాంతాలను రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక అధికారులు కలిసి పరిశీలించాలని చెప్పారు. లైసెన్సుదారులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని, ఎమ్మార్పీ ధరలకు మించి అమ్మరాదని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలువురు అధికారులు, వ్యాపారులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవ

నాగలాపురం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంలో ఉన్న ప్రసిద్ధ శ్రీవేదవల్లి సమేత వేదనారాయణస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. అభిషేకం అనంతరం శ్రీస్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చి ఊంజల్ సేవను వేదోక్తంగా నిర్వహించారు. భక్తులు వీక్షించి తరించారు. ఆలయ టీటీడీ అధికారి శ్రీనివాసులు, షరాబ్ ఉదయకుమార్, ప్రధాన అర్చకులు నాగరాజు భట్టాచార్యులు పాల్గొన్నారు.

నారాయణవనంలో..

నారాయణవనం: శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ఊంజల్‌సేవ వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవి, భూదేవిసమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను అధిష్ఠింపజే ప్రాకారోత్సవం అనంతరం ఊంజల్ మండపంలో ఊయలపై కొలువుదీర్చి ఉయ్యాల సేవ నిర్వహించారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, జమేదార్ రాజశేఖర్ పర్యవేక్షించారు.



ఉయ్యాల సేవ స్వామి, అమ్మవార్లు

తిరుచ్చిపై సీతారాముల అభయం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయానికి అనుబంధంగా వెలసిన సీతారాములు శనివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. స్వామివారి జన్మనక్షత్రమైన పునర్వసు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. సాయంత్రం ఊంజల్ సేవ చేశారు. అనంతరం శ్రీరాముల వారు సీతాలక్ష్మణ ఆంజనేయ సమేతంగా తిరుచ్చిపై ఆశీనులై నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ వెంకటస్వామి, జమేదారు రమణయ్య ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



భక్తులను అనుగ్రహిస్తున్న స్వామి, అమ్మవార్లు

రాయలసీమను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

తిరుపతి కల్చరల్: రాయలసీమను కరువు ప్రాంతంగా ప్రకటించి ఆదుకోవాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ.గఫూర్ డిమాండ్ చేశారు. సీపీఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరీ యాత్ర శనివారం పలమనేరు నుంచి తిరుపతి చేరింది. వారికి అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం కార్యకర్తలు, ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ తాము ఎనిమిది జిల్లాల్లో పర్యటించామని, కరువు విలయ తాండవం చేస్తోందని తెలిపారు. ప్రజలు ఉపాధి కోసం చెన్నై, బెంగళూరు, పూణె నగరాలకు వలస వెళుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాయలసీమను కరువు ప్రాంతంగా ప్రకటించాలని కోరారు. అసమానతలు లేని అభివృద్ధి చేయాలని తాము గతంలో చంద్రబాబునాయుడికి సూచించామని, ఆయన పెడచెవిన పెట్టి అమరావతిని రాజధానిగా ప్రకటించారని తెలిపారు. దీంతో రాష్ట్ర ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించారని తెలిపారు. రాష్ట్రాన్ని తీవ్రంగా అన్యాయం చేసిన బీజేపీని ప్రశ్నించే ధైర్యం ప్రతిపక్షం, పాలక పక్షం చేయకపోవడం సరికాదన్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు రేణిగుంటలో, 11 గంటలకు శ్రీకాళహస్తి, మధ్యాహ్నం ఒంటి గంటకు గూడూరులో బహిరంగ సభతో యాత్ర ముగిస్తుందని తెలిపారు.

పోటీ పరీక్షలకు యువత సన్నద్ధం కావాలి

తిరుపతి సిటీ: పోటీ పరీక్షలకు యువత సన్నద్ధం కావాలని యూపీఎస్సీ కోచింగ్ అసిస్టెంట్ జీండి సురేష్‌కుమార్ తెలిపారు. ఆయన శనివారం ఎస్వీ యూనివర్సిటీ ఇంజినీరింగ్ విభాగం ప్లేస్‌మెంట్ అధికారులతో కలిసి విద్యార్థులకు ఉద్యోగావకాశాలపై పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంపిక చేసుకుని వాటి సాధన కోసం అధ్యాపకుల సలహాలు తీసుకోవాలని ముందుకు సాగాలన్నారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల వివరాలతో పాటు గ్రూప్–1, గ్రూప్–2 ఉద్యోగాలు, వాటికి శిక్షణ గురించి అవగాహన కల్పించారు. అలాగే పద్మావతి మహిళా యూనివర్సిటీలోనూ యూపీఎస్సీ పరీక్షల విధానం, అవకాశాలపై అవగాహన కల్పించారు.



ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పిస్తున్న సురేష్‌కుమార్

డిసెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్

పుత్తూరు రూరల్: స్థానిక సబ్‌కోర్టు ఆవరణలో డిసెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర తెలిపారు. ఆయన శనివారం పోలీసులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ అత్యధిక కేసుల పరిష్కారానికి పోలీసులు కృషి చేయాలని కోరారు. ప్రధానంగా రాజీకి లోబడిన క్రిమినల్ కేసులు, మనోవర్తి కేసులను రాజీ చేయాలని సూచించారు. నగదుతో పాటు విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు మానసిక ఆందోళనలకు దూరం కావాలంటే రాజీ మార్గమే సురక్షితమైనదని కక్షిదారులకు అవగాహన కల్పించాలని వివరించారు. అనంతరం పోలీస్ స్టేషన్ల వారీగా కేసులపై సమీక్ష నిర్వహించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సి.జానకి, అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి గోపాలకృష్ణ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పుత్తూరు, కార్వేటినగరం సీఐలు లక్ష్మీనారాయణ, సత్తిబాబు పాల్గొన్నారు.